క్లుప్తంగా

నేడు భావనారాయణుని కల్యాణం



వధూవరులుగా ఉత్సవ మూర్తులు భావనారాయణ స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారు

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో కొలువైన రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండుగగా జరగనుంది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం అనంతరం రాత్రి 9 గంటలకు కల్యాణం ప్రారంభమవుతుందని ఆలయ ఈఓ భీమేశ్వరరావు తెలిపారు. కల్యాణోత్సవాలలో భాగంగా భావనారాయణ స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు పంచామృత అభిషేకం అనంతరం వధూవరులుగా చేశారు. శనివారం స్వామి వారిని పెద్ద శేష వాహనంపై ఊరేగించి గ్రామోత్సవం చేశారు. భావనారాయణ స్వామి కల్యాణోత్సవంలో పాల్గొని కనులారా వీక్షించాలని ఈఓ కోరారు.

ప్రకృతి పరమార్థం పోతులూరి కాలజ్ఞానం



వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: కలియుగ తత్వవేత్త పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 16వ శతాబ్దంలో లిఖించిన కాలజ్ఞాన అంశాలు ఆత్మజ్ఞానానికి చెందిన ప్రకృతి పరమార్థమని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు అన్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి 331వ ఆరాధన సందర్భంగా శనివారం భోగిగణపతి పీఠంలో గురుపూజలు నిర్వహించి, కాలజ్ఞాన గ్రంథ ప్రవచనం నిర్వహించారు. ధర్మాన్ని ఆచరించడమే భక్తి తత్వమని జగద్గురువు శంకరాచార్య వలె వీరబ్రహ్మేంద్రస్వామి అభ్యుదయ సంస్కరణతో జగద్విఖ్యాతి పొందారన్నారు. బ్రహ్మం గారి ఆరాధనతో బ్రహ్మ, విష్ణు, మహేశ్వర త్రినాథ వ్రత ఫలితం లభిస్తుందన్నారు. తొలుతగా గణపతి పూజ శ్రీవారి 30వ జపయజ్ఞ పారాయణ జరిగింది. పీఠం సభ్యులు సుబ్బలక్ష్మి, శ్రావణి, వరలక్ష్మి, పద్మజ, ఆదిలక్ష్మి, మంగతాయారు పాల్గొన్నారు.

వెండి వడ్డాణం సమర్పణ



కరప: స్థానిక గ్రామదేవత ఉప్పాలమ్మతల్లికి శనివారం భక్తులు 812 గ్రాముల వెండి వడ్డాణం సమర్పించారు. కరప గ్రామానికి చెందిన ఉండమట్ల సూర్యప్రకాష్‌రావు, చిట్టిమణి దంపతుల కుమారుడు ముద్దుకృష్ణ కుటుంబ సభ్యులతో కల్సి అమ్మవారికి వెండి వడ్డాణం బహూకరించి అమ్మవారిపట్ల తమ భక్తిను చాటుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిన్నారి మురళీకృష్ణ దాతల నుంచి వెండి వడ్డాణం స్వీకరించి, అమ్మవారికి అందజేశారు.

మరో విజయం కోసం ఎదురుచూపు

- కురసాల ఇంటికి క్యూ కడుతున్న అభిమానులు
- ఎన్నికల్లో సహకరించిన వారందరికీ ధన్యవాదాలు చెప్పిన ఎమ్మెల్యే



రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద కరప మండలం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ఎన్నికల సంగ్రామం ముగియడంతో ఫలితాల కోసం ప్రతి ఒక్కరూ నిరీక్షిస్తున్నారు. ఐదేళ్ల పాలనలో ప్రజలకు నవరత్న సంక్షేమ పథకాలు అందించిన అధికార వైఎస్సార్ సీపీ మరో విజయం కోసం ఎదురు చూస్తోంది. జూన్ 9న సీఎంగా ప్రమాణ స్వీకారం కోసం ఇప్పటికే ముహూర్తం నిర్ణయించడం, ఫలితాలపై సీఎం జగన్ కేడర్‌ను ఉత్సాహ పరచడంతో గ్రామాలలో వైఎస్సార్ సీపీ శ్రేణులు మంచి జోష్ మీద ఉన్నాయి. కాకినాడ రూరల్ నియోజవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు మరో సారి విజయం సాధించనున్నారు. ఎన్నికల పోలింగ్ సరళిని నిశితంగా పరిశీలించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కన్నబాబు మూడో సారి ఎమ్మెల్యే అవుతారని పందాలకు దిగుతున్నారు. మరో వైపు ఎన్నికల్లో క్షణం తీరిక లేకుండా గడిపిన కన్నబాబు, ఆయన సోదరుడు కల్యాణ్ కృష్ణ, తండ్రి సత్యనారాయణ, కుటుంబ సభ్యులు ఎన్నికల అనంతరం ప్రజలతోనే మమేకమవుతున్నారు. రమణయ్యపేట వైద్యనగర్‌లోని క్యాంపు కార్యాలయం వద్దకు గ్రామాల నుంచి వందలాదిగా ప్రజలు, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు తరలివస్తున్నారు. వారందరితో ఆప్యాయంగా పలకరింపులు చేస్తున్న కన్నబాబుకు తమ తమ గ్రామాలలో పోలింగ్ సరళిని వివరిస్తున్నారు. మహిళా ఓటింగ్‌తో పాటు అన్ని వర్గాల వారు ఫ్యాన్‌కు భారీగా ఓట్లు వేశారని వివరిస్తున్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికి కన్నబాబు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. ఎన్నికల్లో విజయం సాధించబోతున్నట్టు కన్నబాబు తెలియజేయడంతో నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఫలితాల కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించిన ఆర్వో



ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన ఆర్వో వెంకటరావు

కాకినాడ: సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు శనివారం ఈవీఎం ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించారు. రోజువారి పర్యవేక్షణలో భాగంగా ఇతర ఎన్నికల అధికారులతో కలిసి అక్కడకు వెళ్లిన ఆర్వో స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను పరిశీలించారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కూడా పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు ఆర్వో చెప్పారు. ఆయన వెంట ఏఆర్‌ఓ చెల్లన్నదొర ఇతర అధికారులు ఉన్నారు.

సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- జేసీ రామ్‌సుందర్‌రెడ్డి



జేఎన్టీయూలో అమర్చిన సీసీ టీవీ కెమెరాలు, కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: స్ట్రాంగ్ రూమ్ భద్రతను పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాల కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్టు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్ రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. శనివారం జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాల కంట్రోల్ రూమును ఆయన పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని సురక్షితంగా భద్రపరచినట్టు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా స్ట్రాంగ్ రూము వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేశామని జేసీ రామ్ సుందర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు స్ట్రాంగ్ రూము భద్రతను పరిశీలించేందుకు వీలుగా జేఎన్టీయూలోని క్యాంటీన్ పైన సీసీ టీవీ కెమెరాల వ్యూను చూసేందుకు స్క్రీన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఏజెంట్లు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు.

21న రామరాజు కీర్తనల గానం



సమావేశంలో మాట్లాడుతున్న కొచ్చర్లకోట ప్రభాకర సుందరరావు

బోట్‌క్లబ్: ప్రముఖ సంగీత విద్వాంసుడు, వాగ్గేయకారుడు కొచ్చర్లకోట రామరాజు జయంతి సందర్భంగా ఈనెల 21న కాకినాడ సూర్యకళామందిరంలో రామరాజు కీర్తనల గానం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు కొచ్చర్లకోట రామరాజు చారిటబుల్ ట్రస్టు న్యూఢిల్లీ ప్రతినిధి కొచ్చర్లకోట ప్రభాకర సుందరరావు, సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి శనివారం సూర్యకళామందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సుందరరావు మాట్లాడుతూ రామరాజు రచించిన శ్రీకృష్ణ కర్ణామృతం, శ్రీరామ కర్ణామృతం వంటి కీర్తనలు నేటి తరానికి తెలియజేసే ఉద్దేశంతో పెద్దాడ సూర్యకుమారి తదితర కళాకారులు గీతాలను సీడీ రూపంలో తయారు చేయించినట్టు తెలిపారు. ఈ సీడీ ఆవిష్కరణను ఈనెల 21న సాయంత్రం సూర్యకళామందిరంలో నిర్వహిస్తున్నామన్నారు. సీడీని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఆవిష్కరిస్తారన్నారు. ముఖ్య అతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారతీయ కార్య కారిణి సభ్యులు, ఇండియా ఫౌండేషన్ ప్రెసిడెంట్ వారణాసి రాం మాధవ్ పాల్గొంటారన్నారు. అనంతరం పెద్దాడ సూర్యకుమారి, శిష్యులచే కీర్తనల గానం జరుగుతుందన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ హర్షణీయం



కలెక్టర్ నివాస్‌ను సత్కరిస్తున్న ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రతినిధులు

- ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్
- కలెక్టర్ నివాస్‌కు సత్కారం

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లాలో ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించినందుకు ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్‌ను ఎన్‌జీవో అసోసియేషన్ ప్రతినిధులు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌జీవో ప్రతినిధులు గుద్దటి రామమోహన్ రావు, పేపకాయల వెంకటకృష్ణ మాట్లాడుతూ కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం గతం కంటే ఎక్కువగా నమోదైందని, స్వీప్ యాప్ ద్వారా ఓటరుని చైతన్యం చేసి పోలింగ్ బూత్ వరకు వచ్చేలా అన్ని ఏర్పాట్లు చక్కగా చేసిన కలెక్టర్ నివాస్ అభినందనీయులన్నారు. పోలింగ్ సిబ్బంది ఎంతో కష్టపడి పని చేశారని, రాత్రి అయ్యే వరకు పోలింగ్ జరిగినా ఎటువంటి ఇబ్బందులకు అస్కారం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడం అభినందనలు తెలిపారు. ఇటీవల కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసిన వారందరికీ జీతం త్వరితగతిన ట్రెజరీ ద్వారా ఇప్పించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ప్రతినిధులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, అరదాడి సత్తిరాజు, బి.రవి, ఆర్.రాంబాబు షేక్ అజీజ్, నాగేశ్వరరావు, నరేష్, ఛటర్జీ తదదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

కాకినాడ సిటీ: పదో తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థులకు ఈ నెల 21 నుంచి జూన్ 5 వరకు యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవి చక్రవర్తి తెలిపారు. శనివారం సాయంత్రం యూటీఎఫ్ హోంలో ఆయన యూడీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు అత్యంత కీలకం కాబట్టి భవిష్యత్తులో రాణించేందుకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిపుణులైన ఉపాధ్యాయులతో సుమారు 15 ఉచిత అవగాహన తరగతులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతులు నిత్యం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు కాకినాడ కచేరిపేట యూటీఎఫ్ హోంలో జరుగుతాయన్నారు. విద్యార్థులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 93462 64224, 78932 11869 నంబర్లను సంప్రదించాలన్నారు. యూటీఎఫ్ నాయకులు జి.ప్రభాకరవర్మ, సీహెచ్ వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎ.సంజయ్, ఎ వాసు, సీహెచ్ సాహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో తాళ్లరేవు వాసవీ మాత



వాసవీమాత ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసియున్న వాసవీ మాత ఆలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి వాసవీ క్లబ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాబి, వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గోకవరపు సుభాష్, వాసవీక్లబ్ రీజియన్ చైర్మన్ ఎస్.నాగాంబిక తదితరులు హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు సామూహిక కుంకుమ పూజ, పారాయణ చేశారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రజత రవి పత్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలలో తాళ్లరేవు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, వాసవీక్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మరకత మణికంఠ

బోట్‌క్లబ్: అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తర నక్షత్రం సందర్భంగా శనివారం స్థానిక భానుగుడి అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక పెద్దమార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి వారికి ఉత్తరా నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్థానిక రామారావుపేటలోని మరకత మణికంఠకు ఉత్తరా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం అర్చకులు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి పాలు, పంచదార, విభూది, గంధం, కొబ్బరినీళ్లు, తేనె వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. పీఠం వ్యవస్థాపకులు నందమూరి వినోద్ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. పీఠం కార్యవర్గ సభ్యులు పుప్పాల ఉదయభాస్కర్, పబ్బినీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అత్యంత భద్రంగా ఈవీఎంలు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లపై ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేవీఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగింపు నేపథ్యంలో కాకినాడ జేఎన్‌టీయూ కళాశాలలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద భారీ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. నిత్యం ఉదయం, సాయంత్రం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత ఏర్పాట్లపై పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కూడా ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలన్నారు. నియోజకర్గ పరిధిలో 2,15,095 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 13వ తేదీన నిర్వహించిన ఎన్నికల్లో 201 పోలింగ్ కేంద్రాల్లో 1,76,993 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ శాతం స్వీప్ లక్ష్యంతో 82.29 శాతానికి చేరిందన్నారు. వచ్చే నెల నాలుగో తేదీన కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద షిఫ్టుల వారీగా సిబ్బంది విధులు నిర్వర్తించేలా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.

దేదీప్యమానం



సర్క్యులర్ మండపానికి విద్యుత్ సొగసులు



వనదుర్గ ఆలయానికి విద్యుత్ అలంకరణ

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల సందర్భంగా రత్నగిరిపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. కొండ దిగువన టోల్ గేట్ వద్ద గల మహావైకుంఠ నారాయణ ద్వారం, ఘాట్ రోడ్డు, స్వామివారి ఆలయం, ఆలయ ప్రాంగణం, సత్రాలు, ఇతర భవనాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆదివారం కల్యాణ వేదిక, ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించనున్నట్టు విద్యుత్ శాఖ డీఈ వి.సత్యనారాయణ తెలిపారు.



అలరిస్తున్న శివపార్వతుల విద్యుత్ కటౌట్